క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించాలి

భద్రాచలంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ప్రజాపాలన గ్రామసభల దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీని జనవరి 10 వరకు పొడిగించాలని సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు కొనసాగిన ప్రజాపాలన కార్యక్రమాల్లో మధ్యలో సెలవులు వచ్చాయని, దీనివల్ల అనేక మంది ప్రజలు దరఖాస్తులు పెట్టుకోవడంలో ఇంకా వెనకబడి ఉన్నారని అన్నారు. అన్ని మండల ఆఫీసులు గ్రామ పంచాయతీలు వద్ద కౌంటర్లు ఏర్పాటు చేసి జనవరి 10 వరకు దరఖాస్తులు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గొర్రెగుట్ట గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేసి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. గొర్రెగుట్ట, పూసుకుంట, గుస్నేపల్లి గ్రామాల్లో జరుగుతున్న ప్రజాపాలన గ్రామ సభలకు హాజరై, దరఖాస్తుల వివరాల నమోదు రిజిస్టర్లను పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా అటవీ శాఖ అనుమతులు లేక నిలిచిపోయిన బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. దమ్మపేట గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందిన చిన్నశెట్టి సత్యావతి, కుప్పాల శేషగిరిరావు కుటుంబాలను పరామర్శించి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, రావు గంగాధరరావు, చిన్నశెట్టి యుగంధర్, సాయిల నర్సీ, రావు రవిశంకర్, ఎల్లిన మురళీ, యర్రగొర్ల రాధకృష్ణ,ఎర్రా వసంతరావు, కక్కిరాల రమేష్, పగడాల రాంబాబు, చిన్నశెట్టి చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ములకలపల్లి: మండలపరిధిలోని పాతగంగారంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన తొలివార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పూజాధికాలు నిర్వహించారు. స్థానిక పూజార్లు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే జారేకు ఆత్మీయ స్వాగతం పలికారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, సర్పంచ్ కారం సుధీర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నారావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో భద్రాచలం నీరజ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పిల్లలు, మహిళలకు ప్రత్యేకంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందించారు. డాక్టర్ నీరజారెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిలు రోగులకు వైద్యసేవలను అందించారు. ఆస్పత్రి నిర్వాహకులు సుధాకర్‌రెడ్డి, స్థానిక వైద్యులు డాక్టర్ వీవీ మల్లేశ్వరరావు, డాక్టర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు తొలగించాలి

అశ్వారావుపేటరూరల్: విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన బెల్ట్ షాపులను తక్షణమే తొలగించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వాసం బుచ్చిరాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలను తాగుబోతులను చేస్తూ, కుటుంబాలను సర్వనాశనం చేస్తున్న బెల్ట్ షాపులను తొలగించాలని, లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో మద్యం ఏరులైపారుతోందని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వ హయంలో ఆదాయాన్ని పెంచుకునేందుకు అడ్డగోలుగా టెండర్లు పిలిచి మద్యం షాపులకు అనుమతులు ఇచ్చిందని, తాజాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జయప్రదం చేయండి

అశ్వారావుపేటరూరల్: విప్లవ పార్టీల విలీన మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ కోరారు. శనివారం మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే మార్చి 3,4,5 తేదీల్లో విప్లవ పార్టీల విలీన మహాసభలను ఖమ్మం నిర్వహిస్తున్నామని తెలిపారు. మహాసభల్లో మూడు విప్లవ పార్టీలు విలీనం కానున్నాయని, ఇదీ విప్లవోద్యమ చరిత్రలో మంచి పరిణామమని అన్నారు. కంగాల కల్లయ్య, ఎంపీటీసీ సభ్యులు వాసం బుచ్చిరాజు, పూసం శారద, జెట్టి భీమరాజు, నాగేష్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ముట్టడిని..

ములకలపల్లి: నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 12న జరుపతలపెట్టిన పార్లమెంట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. ములకలపల్లిలో శనివారం నిర్వహించిన సంఘ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బోడా అభిమిత్ర, నాయకులు వెంకటేశ్, మహేశ్, ప్రభాస్, తరుణ్, షణ్ముఖ, రవి, చిన్న పాల్గొన్నారు.

ముగిసిన 'ప్రజాపాలన'

అన్ని ప్రాంతాల్లో గత ఎనిమిది రోజులుగా సాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దరఖాస్తులు ముమ్మరంగా వచ్చాయి. ప్రజాప్రతినిధులు, కేటాయించిన అధికారులు దరఖాస్తులు స్వీకరించగా.. ప్రత్యేకాధికారులు, ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షించారు. చివరి రోజు వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మొత్తంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం విజయవంతమైంది. ఇక ఈ దరఖాస్తులపై ప్రభుత్వ తదుపరి కార్యచరణ ఏమిటన్నది ఆసక్తిగా మారింది.

– సాక్షి నెట్‌వర్క్


పినపాక: పాండురంగాపురంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


దుమ్ముగూడెం: పెద్దబండిరేవు ప్రజాపాలనలో దరఖాస్తు స్వీకరిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్


చండ్రుగొండ: రేపల్లెవాడలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సాదియాసుల్తానా


అశ్వాపురం: లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీపీ ముత్తునేని సుజాత


అన్నపురెడ్డిపల్లి: గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


మణుగూరురూరల్: దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

డేటా ఎంట్రీలో తప్పులు దొర్లొద్దు


దుమ్ముగూడెం: డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఆర్డీఓ మంగీలాల్

దుమ్ముగూడెం: ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీలో ఎటువంటి తప్పులూ దొర్లకుండా చూడాలని ఆర్డీఓ మంగీలాల్ ఆపరేటర్లకు సూచించారు. శనివారం లక్ష్మీనగరం గ్రామంలోని మండల అభివృద్ధి కార్యాలయం వద్ద జరుగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ డేటా ఎంట్రీలు తప్పులు దొర్లకుండా ఎంట్రీ చేయాలని ఆపరేటర్లకు సూచించారు. ప్రతీ దరఖాస్తు ఎంట్రీని క్షుణంగా పరిశీలించాలన్నారు. ఈ నెల 13వ తేదీ లోగా డేటా ఎంట్రీలను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కువ మంది ఆపరేటర్‌లను ఏర్పాటు చేసి డేటా ఎంట్రీ పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ ముత్యాలరావు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కరకగూడెం: కరకగూడెం మేజర్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామ సదస్సును ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం 22 మంది లబ్ధిదారులకు రూ.లక్షా 116చొప్పున కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ తాతారావు ఎంపీడీఓ శంకర్, తహసీల్దార్ కె.చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ సంధ్య, జెడ్పీటీసీ సభ్యుడు కొమరం కాంతారావు, సర్పంచ్‌లు ఊకె రమానాథం, పోలేబోయిన శ్రీవాణి, తోలెం నాగేశ్వరరావు, కుంజా వసంతరావు, ఎంపీటీసీ శైలేజా పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, నాయకులు రావుల రవి, సురేష్, జలగం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్షింతల పంపిణీ

చర్ల: అయోధ్యలో ఈ నెల 22న బల రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని అయోధ్య నుంచి భక్తులకు అందజేసేందుకు చర్లకు వచ్చిన అక్షింతలను చర్ల మండలంలోని వివిధ గ్రామాల్లో పంపిణీ చేస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని సాలెబజార్, గణేష్‌నగర్, శివాలయం వీది, పాతచర్ల, అంబేద్కర్‌నగర్, కొత్తపల్లి, లింగాపురం, గొంపల్లి తదితర గ్రామాల్లో అక్షింతలను పంపిణీ చేశారు. అక్షింతల ప్రముఖ్యతను ప్రజలకు వివరించారు.

మట్టిని సీజ్ చేసిన తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్..

దమ్మపేట: 'గుట్టుచప్పుడు కాకుండా.. అర్ధరాత్రి అక్రమంగా మట్టి తోలకాలు'అను శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనంపై దమ్మపేట మండల తహసీల్దార్ ముజాహిద్ స్పందించారు. ప్రాథమిక విచారణ జరిపిన అనంతరం, చర్యలకు ఉపక్రమించారు. స్థానిక ఇంటిలిజెన్స్ పోలీసులు కూడా దీనిపై పూర్తి వివరాలను ఉన్నత అధికారులకు పంపినట్టు సమాచారం.

తహసీల్దార్.. మండలపల్లి గ్రామ శివారులో మైనింగ్ జరిగిన ప్రాంతానికి ఆర్ఐ వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఒక టీంను పంపారు. మట్టి మైనింగ్ క్వారీ నుంచి ఆదే గ్రామంలోని లోతట్టు ప్రాంతం చదును చేసేందుకు, సుమారు 420 ట్రాక్టరు ట్రిప్పుల మట్టిని తరలించినట్టుగా గుర్తించారు. ఆ ప్రాంతంలో ఉన్న మట్టిని పరిశీలించిన అనంతరం పంచానామా చేసి, ఆ మట్టిని సీజ్ చేశారు. అక్రమ మట్టి మైనింగ్‌కు పాల్పడిన వ్యక్తులు, జేసీబీ యంత్రాలు, ట్రాక్టర్ల వివరాలను దమ్మపేట ఎస్సై రవికుమార్‌కు లిఖితపూర్వకంగా పంపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనింగ్ శాఖ అధికారులకు కూడా తగు నివేదికను పంపడం జరిగిందని తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ హెచ్చరించారు.


మట్టిని తరలించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తిరుపతికి వచ్చి తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామిని పాదయాత్రగా వచ్చి మొక్కు చెల్లించుకుంటామని తీసుకున్న తీర్మాణం ప్రకారం.. కాంగ్రెస్ నాయకులు శనివారం తిరుపతికి పాదయాత్రగా బయలుదేరారు. కాంగ్రెస్ నాయకులు జానపాటి వేణు, చీమల రమేష్‌ల పాదయాత్రను పార్టీ నియోజకవర్గ నాయకులు బట్టా విజయ్‌గాంధీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద వారికి పూలమాలలు వేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ పాదయాత్రకు పలువురు పార్టీ నాయకులు, అభిమానులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ కేవీరావు, ఉపసర్పంచ్‌లు పుచ్చకాయల శంకర్, గోరంట్ల కనకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


చండ్రుగొండ: కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

చండ్రుగొండ: కాంగ్రెస్‌పార్టీకి చెందిన నూతన క్యాలెండర్‌ను ఆ పార్టీ మండల నాయకులు శనివారం ఆవిష్కరించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం ప్రముఖంగా ఉన్న ఈ క్యాలెండర్‌ను కార్యకర్తలకు, అభిమానులకు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు భోజ్యానాయక్, కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, ఉప్పతల ఏడుకొండలు, గాదె శివప్రసాద్, దారం గోవిందరెడ్డి, టి.సురేష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్..

అశ్వాపురం: అశ్వాపురం మండలంలోని గౌతమినగర్‌కాలనీలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను హెవీ వాటర్ ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎస్.జగ్గారావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ముద్రించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోగుల కొమరయ్య, పాడ్యా కేశవరావు, నాయకులు డీవై.స్వామి, రత్నకుమార్, లక్ష్మణకుమార్, సాలిక్, వినయ్ సాగర్, టీఎస్‌పీ రవికుమార్, పీ శ్రీనివాసరావు, మోహన్‌బాబు, లక్ష్మయ్య, దీపక్, నరేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మణుగూరురూరల్: ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని తిర్లాపురం గ్రామంలో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. న్యాయం ప్రతీ ఒక్కరి హక్కు అని అన్నారు. రాజ్యాంగం, చట్టాల గురించి అందరికీ తెలియాలని, అందుకోసం మారుమూల గిరిజన గ్రామాల్లోనూ న్యాయ చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు తొందరపడి వివాదాలు పెట్టుకోవద్దని, ఘర్షణలకు పోయి కేసుల్లో చిక్కుకుని తమ సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. వీలైనంత వరకు సమస్యను రాజీ కుదుర్చుకోవాలన్నారు. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు, అక్కడ పట్టించుకోకపోతే కోర్ట్‌ను ఆశ్రయించాలని తెలిపారు. యువత చెడు మార్గాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, మండల న్యాయ సేవ అధికారి సంస్థ సభ్యుడు సర్వేశ్వరరావు, న్యాయవాదులు ప్రవల్లిక, చిర్ర రవి, వలసాల శైలజ, పోశం భాస్కర్, వి పద్మావతి, కోర్ట్ లైజనర్స్ మురారి, బుచ్చిబాబు, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

గెలుపోటములు సహజం

చండ్రుగొండ: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని దామరచర్ల గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం బీఆర్ఎస్‌పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ రోజు మనతో ఉన్న వారే మనవారు, మళ్లీ భవిష్యత్ మనదేనని అన్నారు. ఎవరూ అధైర్య పడొద్దని కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపేదుకు ప్రయత్నించారు. రాబోవు పార్లమెంటు ఎన్నికలకు సిద్ధమౌదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకభావం ఏర్పడిందని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి యుఎస్ ప్రకాష్, జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

ఎస్పీని కలిసిన భద్రాచలం సీఐ

భద్రాచలంఅర్బన్: జిల్లా నూతన ఎస్పీగా నియమితులైన రోహిత్ రాజ్‌ను శనివారం భద్రాచలం సీఐ నాగరాజు రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. భద్రాచలం పరిస్థితుల గురించి టౌన్ సీఐ నాగరాజు రెడ్డిని ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సామాన్యులను ఇబ్బంది పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా భద్రాచలం జైల్ సూపరింటెండెంట్ ఉపేందర్ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఎస్పీ కలిసిన వారిలో టౌన్ ఎస్సైలు, మధుప్రసాద్, పీవీఎస్ రావు, విజయలక్ష్మి తదితరులున్నారు.


ఎస్పీ రోహిత్‌రాజ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ నాగరాజు రెడ్డి


వీధి కుక్కలకు వింత రోగం


వ్యాధి సోకిన కుక్క

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో తిరిగే కొన్ని వీధి కుక్కలకు వింత రోగం సోకింది. వ్యాధి సోకిన కుక్కల చర్మం మొత్తం ఊడిపోయి భయంకరంగా కనిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం ఐదు, ఆరు కుక్కలకు మాత్రమే ఈ వ్యాధిసోకగా క్రమంగా వాటి సంఖ్య పెరుగుతోంది. అధికారులు స్పందించి ఈ వ్యాధి ఇతర కుక్కలు, ముఖ్యంగా పెంపుడు కుక్కలకు సోకకుండా చర్యలు తీసుకోవాని స్థానికులు కోరుతున్నారు. ఎలాంటి వాటి స్థానిక పశువైద్య అధికారులు ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అంటున్నారు. అదే విధంగా భద్రాచలం పట్టణంలో వీధి కుక్కలకు వస్తున్న ఈ వ్యాధిని వీలైనంత త్వరగా అరికట్టిందుకు ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని పెంపుడు జంతువుల యజమానులు కోరుతున్నారు.

పెరుగుతున్న 'కుండీ' ట్రెండ్

- ఇంటి అలంకరణలో మొక్కలకు ప్రాధాన్యత
- పెంపకంలో మారుతున్న అభిరుచి
- వివిధ డిజైన్లలో కుండీలు ఏర్పాటు


పింగాణీ కుండీలో..


అమ్మడానికి సిద్ధంగా ఉన్న ప్లాస్టిక్ కుండీలు


ప్లాస్టిక్ కుండీలలో అందమైన మొక్కలు

సండే స్పెషల్

భద్రాచలంటౌన్: ప్రస్తుత కాలంలో ప్రతి ఇంటిలోనూ మొక్కలు అలంకారణలో భాగమవుతున్నాయి. ఇంటి ముందు అందరూ మొక్కలు పెంచుతారు. కానీ వీటికి మరింత అందం జతచేసేందుకు పలువురు పలు ఆకృతుల గల మట్టి, ప్లాస్టిక్, పింగాణీ కుండీలను వినియోగిస్తున్నారు. వ్యాపారులు సైతం ప్రజల అభిరుచులకు అనుగుణంగా పలు రకాల భిన్న ఆకారాల్లో పింగాణీ కుండీలు తయారు చేస్తున్నారు.

ఒకప్పుడు మొక్కలు నాటామా...అవి ఎదిగాయా...చూడటానికి అందంగా ఉన్నాయా అని మాత్రమే చూసేవారు. కాని, రాను రాను ఇళ్ళలో మొక్కలకు అందంమైన కుండీలు ఏర్పాటు చేయాలనే తపన ప్రజల్లో భాగా పెరిగిపోయింది. ముఖ్యంగా మహిళలు తమ ఇళ్లను మొక్కలతో అందంగా ముస్తాబు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో ప్లాస్టిక్, మట్టి, సిమెంట్‌తో తయారు చేసే సాధారణ కుండీలను వినియోగించేవారు. ప్రస్తుతం వాటి స్థానంలో వివిధ డిజైన్లలో అందంగా ఉండే కుండీలు వినియోగించడం లేటెస్ట్ ట్రెండ్‌గా మారింది. అందమైన రూపం రకరకాల డిజైన్లు, ఆకట్టుకునే బొమ్మలతో మార్కెట్‌లో కొత్త రకం కుండీలు లభిస్తున్నాయి.

పల్లెల్లో సైతం..

మొక్కలను పెంచేందుకు ఏర్పాటు చేస్తున్న కుండీలను అందంగా వివిధ రకాల ఆకృతుల్లో తయారు చేస్తుండడంతో నగరవాసులే కాకుండా పల్లెలు, పట్టణాల్లో ప్రజలు సైతం కొత్త వాటివైపు మొగ్గచూపుతున్నారు. ఇళ్లు, అపార్టుమెంటుల వద్ద మొక్కలను పెంచడం ద్వారా అవి అందంగా ఉడడంతో పాటు ఆహ్లాదకర వాతావరణాన్ని ఇస్తాయి. ఈ క్రమంలో మొక్కలు పెంచేందుకు ప్లాస్టిక్ కుండీలతో పాటు సిమెంట్, పింగాణీ కుండీలను ఉపయోగిస్తున్నారు. వీటికితోడు ప్లాస్టిక్‌తో తయారు చేసిన చిన్న సైజు వేలాడదీయగలిగే కుండీలకు కూడా మంచి డిమాండ్ ఉంది. ఈ కుండీల్లో చిన్న సైజు మొక్కలు నాటి ఇంటి ముందు అలంకరించుకునేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు.

సైజ్ ఆధారంగా ధర

మొక్కలను పెంచేందుకు వినియోగించే ప్లాస్టిక్ కుండీల ధర సైజు ఆధారంగా ఉంటోంది. ఒక్కో కుండీ ధర రూ.50 నుంచి రూ.300 వరకూ ఉంటుంది. సిమెంట్ కుండీలు ఒక్కొక్కటీ రూ.100 నుంచి రూ.400 వరకూ వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. ఇక పింగాణీ కుండీల కనీస ధర రూ.100 ఉండగా సైజు బట్టీ రూ.1000 వరకు ఉన్నాయి. భద్రాచలం పట్టణంలో మూడు నర్సరీలు ఉన్నాయి. ఇక్కడి నుంచే పరిసర ప్రాంతాలలో ప్రజలకు పూల కుండీలను, మొక్కలను నిర్వాహకులు విక్రయిస్తున్నారు.

అందుబాటులో అందమైన కుండీలు



ఈ కుండీల్లో మొక్కలు పెంచడం ఎంతో ఆనందాన్నిస్తోంది. మొక్కలకు సరిపోయేంత నీరుపోసుకోవడం, సంరక్షణ చూడడం వీటిల్లో సులభతరం అవుతుంది. మొక్కలు కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజల అభిరుచికి తగ్గట్టు మేము కొత్త రకం మొక్కలను దిగుమతి చేసుకుంటున్నాం.

– సుమన్, నర్సరీ నిర్వాహకుడు, భద్రాచలం